సాక్షి
ఏలూరు
శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



నెలలోనే మద్యం నుంచి విముక్తి

మద్యానికి బానిసైన వారి జీవితాలను చక్క దిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న డీ అడిక్షన్ కేంద్రాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. 8లో ▸



ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కైకలూరు మండలం సింగాపురం వద్ద ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధురాలు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. 8లో ▸



భార్యపై కత్తితో దాడి

ఏలూరు జిల్లా ముండూరు గ్రామంలో భార్యపై అనుమానంతో ఓ భర్త కత్తితో దాడి చేయడంతో ఆమెకు తీవ్రగాయా లయ్యాయి. 8లో ▸



వైద్యుల భద్రత కీలకం



వైద్యాధికారులు, వైద్యసిబ్బందికి మరింత భద్రత కల్పించేందుకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలి. రోగాలను నయం చేసే వైద్యులు, వైద్య సిబ్బందికి అభద్రతా భావం ఉంటే అంకితభావంతో వైద్యసేవలు ఎలా చేయగలరు. వైద్యులపై దాడులు, దౌర్జన్యాలు చేయడం సరికాదు. ఈ విధానం మారాలి. వైద్యులతో పాటు మహిళా వైద్యులు, సిబ్బందికి పటిష్ఠమైన భద్రత కల్పించాలి.

– డాక్టర్ చైతన్య, మెడికల్ ఆఫీసర్, పోతునూరు పీహెచ్‌సీ

ట్రైనీ డాక్టర్‌పై అఘాయిత్యం దారుణం



ట్రైనీ డాక్టర్‌పై అఘాయిత్యం చేయడం దారుణం. లైగింక దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలి. ఇందుకోసం అవసరమైతే ప్రత్యేక చట్టాలు రూపొందించాలి. పని ప్రదేశంలో వైద్య సిబ్బందికి భద్రత కల్పించాలి. వైద్యులు పలుసార్లు 36 గంటలు పాటు విధులు నిర్వహిస్తున్నారు. దీనివల్ల తీవ్రమైన పని ఒత్తిడిలో ఉంటున్నారు. వారికి సరైన విశ్రాంతి కల్పించాలి. పక్కా భద్రత నడుమ రెస్ట్ రూమ్స్ ఏర్పాటుచేయాలి.

– డాక్టర్ ప్రదీప్‌చంద్ర, చాటపర్రు పీహెచ్‌సీ వైద్యులు

న్యూస్‌రీల్

మూడోసారి వైనాట్‌కు టైమ్స్ బిజినెస్ అవార్డు



నటి రకుల్‌ప్రీత్ సింగ్ నుంచి అవార్డు అందుకున్న వెంకట్రాయుడు దంపతులు

తణుకు: పట్టణానికి చెందిన వైనాట్ షాపింగ్ మాల్ అధినేత జుజ్జవరపు వెంకటరాయుడు ప్రముఖ నటి రకుల్‌ప్రీత్‌సింగ్ చేతుల మీదుగా టైమ్స్ బిజినెస్ అవార్డును బుధవారం అందుకున్నారు. ఎలక్ట్రానిక్స్, హోం అప్లయన్సెస్ విభాగంలో ఉత్పత్తులు, ఉత్తమ సర్వీసులు అందించినందుకు గాను విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకట్రాయుడు, శ్రీదేవి దంపతులు ఈ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, వాణిజ్యశాఖ మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ఇప్పటివరకు మూడోసారి ఈ అవార్డును అందుకోవడం విశేషం. ఈ విజయంలో వినియోగదారులకు భాగస్వామ్యం ఉందని పేర్కొన్నారు.

1 నుంచి శ్రీవారి నిత్యకల్యాణ రుసుము పెంపు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యార్జిత కల్యాణం సేవా టికెట్ రుసుము సెప్టెంబర్ 1వ తేదీ నుంచి పెరగనుంది. ప్రస్తుతం రూ.1,500లుగా ఉన్న ఈ టికెట్ ధర రూ.2 వేలకు పెంచుతున్నట్లు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు గురువారం తెలిపారు. స్వామివారికి జరిగే నిత్య కల్యాణానికి ఎంతో విశిష్టత ఉంది. కోరిన కోర్కెలు తీరిన భక్తులు, అలాగే కోర్కెలు తీరాలని మొక్కుకున్న వారు ఈ సేవలో ఎక్కువగా పాల్గొంటారు. ప్రస్తుతం సాధారణ రోజుల్లో 70 నుంచి 100 మంది, ప్రతి శని, ఆదివారాలు, ఇతర పర్వదినాల్లో 230 నుంచి 250 మంది వరకు దంపతులు ఈ సేవలో పాల్గొంటున్నారు.

ఒక రోజు ముందే పెన్షన్ల పంపిణీ



కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు (మెట్రో): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ఒక రోజు ముందుగా ఆగస్టు 31వ తేదీనే అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. సెప్టెంబర్ నెల పెన్షన్ల పంపిణీపై సంబంధిత అధికారులతో గురువారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈనెల 31వ తేదీ ఉదయం 6 గంటల నుంచే పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేసేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. శనివారం ఏదైనా కారణంతో పెన్షన్ తీసుకోని వారికి సెప్టెంబర్ 2న పంపిణీ చేస్తామన్నారు. ఏలూరు జిల్లాలో సెప్టెంబర్ నెలలో 2,65,992 మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.113.67 కోట్ల సొమ్ము పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

'ట్రిపుల్ ఐటీల్లో రేషన్ బియ్యం పెడుతున్నారు'

నూజివీడు: ట్రిపుల్ ఐటీల్లోని మెస్‌లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏఐఎస్‌ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఏ బృందం ట్రిపుల్ ఐటీలోని మెస్‌లను గురువారం సందర్శించింది. అనిల్ మాట్లాడుతూ భోజనంలో బొద్దింకలు, రాళ్లు, పురుగులు వస్తున్నాయని, ఇలా అయితే విద్యార్థులు ఎలా తింటారని ప్రశ్నించారు. రేషన్‌షాపుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని అన్నం వండి విద్యార్థులకు పెడుతున్నారని ఆరోపించారు. ఏఐఎస్‌ఏ జిల్లా కార్యదర్శి గరికే అఖిల్, రాష్ట్ర నాయకులు డీ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పల తొలగింపు



ఆగిరిపల్లిలో చెత్తను తొలగించిన దృశ్యం

సాక్షి స్పందన

ఆగిరిపల్లి: అగిరిపల్లిలో పేరుకుపోయిన చెత్త కుప్పలను పంచాయతీ అధికారులు గురువారం పారిశుద్ధ్య సిబ్బందితో తొలగింపజేశారు. 'అధ్వానంగా పారిశుద్ధ్యం' అనే శీర్షికన గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ స్పందించారు. స్థానిక గన్నవరం రోడ్డులోని వెంకటేశ్వర సినిమా థియేటర్ రోడ్డు వద్ద ఉన్న చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించి, మురుగు కాలవలో పూడికలను తొలగించారు. అధికారులు స్పందించి పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించడంతో స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇసుక మారు బేరం

- రీచుల్లో కొనుగోలు.. బ్లాక్ మార్కెట్‌లో విక్రయం
- జిల్లాలో జోరుగా ఇసుక అక్రమ వ్యాపారం
- రీచ్‌ల నుంచి తెచ్చి ఏలూరు, ఇతర చోట్ల అమ్మకం
- ఇబ్రహీంపేట నుంచి మళ్లీ తెలంగాణకు అక్రమ రవాణా
- అశ్వారావుపేటలో ఇసుక డంప్‌ను గుర్తించిన అధికారులు
- అక్రమ రవాణాపై అధికారుల పర్యవేక్షణ నామమాత్రమే
- ఇసుక కొరత నేపథ్యంలో అధిక ధరకు భారీగా విక్రయాలు
- 20 టన్నుల లారీ ఏలూరులో రూ.35 వేలు పైమాటే

రియల్ ఎస్టేట్ మాదిరిగా జిల్లాలో ఇసుక కూడా మారు బేరం వ్యాపారం మొదలైంది. వాహనదారులు రకరకాల ఆధార్‌కార్డులతో రీచ్‌ల్లో ఇసుకను కొనుగోలు చేసి అక్కడక్కడ నిల్వలు చేస్తున్నారు. అవసరమైన వారికి డిమాండ్‌ను బట్టి అధిక ధరలకు విక్రయించే మారుబేరం వ్యాపారానికి జిల్లాలో తెరతీశారు. అధికారులు మాత్రం పూర్తి పారదర్శకంగా ఒక్క టన్ను కూడా అక్రమ దారి పట్టకుండా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నప్పటికీ రోజూ జరిగే విక్రయాల్లో 50 శాతం మారు బేరగాళ్ల విక్రయాలుగానే ఉన్నాయి. జిల్లాలో ఇసుక కొరత నేపథ్యంలో భారీగా డిమాండ్ పలుకుతుండటంతో కొందరు ఈ వ్యాపారం బాట పట్టారు.



ఇబ్రహీంపేట స్టాక్‌పాయింట్ వద్ద ఇసుక నిల్వలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇసుక కొరత వెంటాడుతోంది. జిల్లాలో గోదావరి పరీవాహక ప్రాంతం పుష్కలంగా ఉండటం, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సుమారు 10 రీచ్‌లు, 5 డీసిల్ట్ పాయింట్లను ప్రభుత్వమే అధికారికంగా గుర్తించింది. ఇక ఏలూరు జిల్లాలో ఇబ్రహీంపేట, వింజరం, చేబ్రోలులో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసి గత నెల 8వ తేదీ నుంచి విక్రయాలు సాగిస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో 5 స్టాక్ పాయింట్లు ఉన్నప్పటికీ ఒక్కచోట కూడా ఇసుక లేకపోవడంతో తూర్పుగోదావరి నుంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో గోదావరి జిల్లాల్లోని గోదావరి ఇసుక సక్రమంగా లభ్యం కావడం లేదు. దీనిని కొందరు వ్యాపారులు భారీ ఆదాయ వనరుగా మలుచుకున్నారు. ఆధార్ కార్డులను సేకరించి ఒక్కో ఆధార్‌కార్డు, సంబంధిత వ్యక్తి ఫోన్ నంబర్‌తో ఒక లారీ లోడ్ బుక్ చేసుకుని నగదు చెల్లించి ఇసుకను తీసుకువచ్చి వేరే ప్రాంతంలో డంప్ చేయడం, బేరం రాగానే ఇసుకను తోలేయడం మొదలుపెట్టారు. ప్రధానంగా ఏలూరు జిల్లాలో ఇబ్రహీంపేట రీచ్‌లో అక్రమాలు కోకొల్లలుగా సాగుతున్నాయి. గత నెల 8న రీచ్ ప్రారంభమయ్యాయక సుమారు 5 వేల టన్నుల ఇసుక తెలంగాణకు, ఇతర ప్రాంతాలకు అక్రమంగా రవాణా అయినట్లు అధికారులు గుర్తించారు. కనీసం బాధ్యులపై కేసులు నమోదు చేసి అరెస్టులు కూడా లేకుండా స్టాక్ పాయింట్‌లో ఉన్న ఉద్యోగులకు మెమోలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. విచారణ పేరుతో దాదాపు నెల రోజుల పాటు స్టాక్ పాయింట్‌లో విక్రయాలు నిలిపివేశారు. మళ్లీ ఈ నెల 22వ తేదీ నుంచి ప్రారంభించారు. అయితే అక్రమాలేమి ఆగలేదు కాని.. రూటు మారడం గమనార్హం.

స్టాక్ పాయింట్ నుంచి అశ్వారావుపేటకు..

తాజాగా విక్రయాలు ప్రారంభమైన తరువాత ఇబ్రహీంపేట స్టాక్‌పాయింట్ నుంచి తెలంగాణలోని అశ్వారావుపేటకు ఇసుక అక్రమ రవాణా జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. అయితే రీచ్‌లో మాత్రం లబ్ధిదారుడి ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, వాహన నంబర్ వివరాలు తీసుకుని బిల్లు ఇస్తున్నారు. అయితే అలా కొనుగోలు చేసిన కొందరు వ్యక్తులు అశ్వారావుపేటలో సుమారు 200 టన్నుల ఇసుకను డంప్ చేశారు. అక్కడ స్థానికులు ఆంధ్రా ఇసుక ఇక్కడకు వచ్చిందంటూ సోషల్ మీడియాలో పెట్టడంతో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో కుక్కునూరు పోలీసులు రెండు వాహనాలు సీజ్ చేశారు.

ఆధార్ కార్డులు తీసుకుని..

అలాగే మరో కొత్త అంశం తెరపైకి వచ్చింది. ఏలూరు నగరానికి చెందిన ఒక కమ్యూనిస్టు పార్టీకి చెందిన నేత, ఆయన కుమారుడి ఆధార్ కార్డులు ఒక లారీ డ్రైవర్ తీసుకున్నాడు. వారి పేరుతో ఇబ్రహీంపేట స్టాక్‌పాయింట్‌లో ఇసుకను లోడ్ చేసి ఏలూరులో వేరేవారికి విక్రయించారు. ఈ అంశం అక్కడి నేతలకు తెలిసి విచారిస్తే.. తమకేమి తెలియదని.. తెలిసిన డ్రైవర్‌కు ఆధార్ కార్డు ఇచ్చామని బదులిచ్చారు. డ్రైవర్‌కు ఫోన్ చేస్తే స్పష్టమైన సమాధానం లేని పరిస్థితి. గడిచిన వారం రోజుల వ్యవధిలో ఏలూరు జిల్లాలో సుమారు 10 వేల టన్నుల ఇసుక విక్రయాలు జరిగాయి. దీనిలో 85 శాతం ఇబ్రహీంపేట స్టాక్‌పాయింట్ నుంచే వెళుతుంది. ఏలూరు నగరంలో 20 టన్నుల ఇసుక లారీ ధర రూ.35 వేలు పైమాటే, ఇబ్రహీంపేటలో స్టాక్ పాయింట్ వద్ద ఇసుక ధర రూ.210 చొప్పున ఒక లారీ లోడుకు రూ.4,200, ప్రభుత్వ నిబంధనల ప్రకారం 30 కిలోమీటర్ల పైబడిన రవాణాకు కిలో మీటరుకు రూ.120 చొప్పున ఏలూరుకు ఇబ్రహీంపేట నుంచి ఇసుక రావాలంటే రూ.20 వేలు అవుతుంది. కానీ ఇక్కడ రూ.35 వేలు ధరకు విక్రయిస్తున్నారు. అలాగే ఇతర నియోజకవర్గాల్లో కూడా ఇదే తరహాలో అక్రమ వ్యాపారం సాగుతోంది.

క్రీడల్లో విజేతలకు బహుమతుల అందజేత



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు (మెట్రో): హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజు పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించిన క్రీడల్లో విజేతలను కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో గురువారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి మెడల్స్, సర్టిఫికెట్స్ అందించి అభినందించారు. అలాగే జిల్లా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ పోటీల్లో పాల్గొని రాణించిన హ్యాండ్‌బాల్ క్రీడాకారులు కె.వనజ, వి.సౌజన్య, రెహ్మాన్, ఫార్మర్ రంజీ కెప్టెన్, అథ్లెటిక్స్ కోచ్ డి.ప్రసాద్, సాయి సుందర్ సాహిల్ బాబు, వెయిట్ లిఫ్టింగ్‌లో శ్రీనివాసులను కలెక్టర్ సత్కరించారు.

5 స్కూళ్లకు స్పోర్ట్స్‌డే పురస్కారాల ప్రదానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నేషనల్ స్పోర్ట్స్‌డే సందర్భంగా క్రీడల్లో జాతీయ, రాష్ట్ర, అంతర్ జిల్లా స్థాయిల్లో అత్యధిక పతకాలు సాధించిన 5 పాఠశాలలకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్–2024 పురస్కారాలను డీఈఓ అబ్రహం గురువారం అందజేశారు. పెదవేగిలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర హైస్కూల్, ఏలూరులోని సెయింట్ థెరిస్సా, కస్తూరిబా, వట్లూరులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, పోణంగి జెడ్పీ హైస్కూల్ ఉన్నాయి.

ఏజెన్సీలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

మాజీ ఎమ్మెల్యే బాలరాజు డిమాండ్



కొయ్యలగూడెం: ఏజెన్సీలో ప్రభుత్వం వెంటనే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విష జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, ప్రజల ఆరోగ్యం కోసం తీసుకుంటున్న చర్యలు ఏమీలేవని విమర్శించారు. పోలవరం నియోజకవర్గంలో ప్రతి పల్లెలో విషజ్వరాలు ప్రబలడంతో ప్రజలు భయాందోళనలతో గడుపుతున్నారన్నారు. గత నెల రోజుల నుంచి ప్రతి ఊరిలో విషజ్వరాలతో వైద్య చికిత్స కేంద్రాలకు రోగులు క్యూ కడుతున్నారన్నారు. గవర్నమెంట్ వైద్యశాలలో సరైన సిబ్బంది, మందులు లేక ప్రజలు పట్టణాల్లో కార్పొరేట్ వైద్యశాలలో వైద్యం చేయించుకుని ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. కనీసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంలోనూ కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారని, స్కూల్, హాస్టల్ విద్యార్థుల వద్దకే వైద్యుల బృందాన్ని పంపించేవారని బాలరాజు గుర్తు చేశారు. ఏజెన్సీలో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు వ్యాపిస్తున్నా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో మందులు, వైద్యుల కొరతతో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందడం లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను కొనుగోలు చేసే ప్రయత్నాల మీద ఉన్న శ్రద్ధ ప్రజల ఆరోగ్యంపై లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు కావస్తున్నా ఇప్పటివరకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి ఏజెన్సీలో విషజ్వరాలతో బాధపడుతున్న వారికి, గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అందుబాటులో మందులు ఉంచాలని బాలరాజు డిమాండ్ చేశారు.

బ్యారన్‌కు 4,125 కేజీల అనుమతి

జంగారెడ్డిగూడెం: వర్జీనియా పొగాకు బోర్డు 2024–25 సీజన్‌కు గాను బ్యారన్‌కు 4,125 కేజీల కోటా అనుమతించినట్లు వర్జీనియా వేలం నిర్వహణాధికారి జె.సురేంద్రకుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 పంట కాలానికి రిజిస్ట్రేషన్ రెన్యువల్/బ్యారన్ ఆపరేటర్‌గా లైసెన్స్ పొందడానికి అర్హతలను ఆయన వివరించారు. వచ్చే సీజన్‌కు ఒక బ్యారెన్ పరిధిలో 4.37 ఎకరాలు భూమి ఉండాలన్నారు. రిజిస్ట్రేషన్ దరఖాస్తులు అక్టోబర్ 24 వరకు స్వీకరిస్తామని, రూ.100 పెనాల్టీతో నవంబర్ 8వ తేదీ వరకు, రూ.400 పెనాల్టీతో నవంబర్ 20 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఆ తరువాత వచ్చే దరఖాస్తులు తిరస్కరిస్తామన్నారు. 1/70 చట్టంలో ఉన్న వారు రూ.100 స్టాంప్‌పై ధ్రువీకరణపత్రం నోటరీ చేయించి సమర్పించాలని, అలాగే 50 శాతం లోపు పొగాకు అమ్మిన వారు బ్యారెన్‌కు రూ.3వేలు పెనాల్టీ చెల్లించాలి తెలిపారు. 25 శాతం లోపు పొగాకు అమ్మిన వారు బ్యారన్‌కు రూ.5 వేలు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. పొగాకు బోర్డు నిబంధనలు పాటిస్తూ రిజిస్ట్రేషన్ రెన్యువల్ చేయించుకోవాలని సురేంద్రకుమార్ సూచించారు.

వైఎస్సార్ సీపీ నేతల కీలక భేటీ



ఏలూరులో సునీల్ నివాసంలో సమావేశమైన మాజీ మంత్రి కారుమూరి, మాజీ ఎమ్మెల్యేలు డీఎన్నార్, వాసుబాబు, చింతలపూడి కన్వీనర్ విజయరాజు, నేతలు జయప్రకాష్, శ్రీలక్ష్మి



సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్‌ను అభినందించిన ఇన్‌చార్జులు
- ఎంపీ అభ్యర్థి సునీల్ నివాసంలో ముఖ్యనేతల సమావేశం
- ఏలూరు నగర ముఖ్య నేతలు, కార్పొరేటర్ల హాజరు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు కీలకభేటీ నిర్వహించారు. గురువారం నగరంలోని పార్టీ ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ కారుమూరి సునీల్ కుమార్ నివాసంలో ముఖ్యులు సమావేశమయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా కైకలూరు మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావును నియమించిన నేపథ్యంలో పలు నియోజకవర్గాల ఇన్‌చార్జులు మర్యాదపూర్వకంగా భేటీ అయి జిల్లాలోని పలు అంశాలపై చర్చించారు. మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సమావేశంలో పాల్గొని ఇన్‌చార్జులతో మాట్లాడారు. జిల్లాలో రాజకీయ పరిణామాలు, అధికార పార్టీ అనుసరిస్తున్న విధానాలతో జరుగుతున్న నష్టం, రైతాంగ సమస్యలు ఇలా అన్ని నియోజకవర్గాల్లోని అంశాలపై చర్చించారు. అనంతరం దూలం నాగేశ్వరరావును ఇన్‌చార్జులు సన్మానించారు. ఏలూరు నగర నియోజకవర్గ నేతలతో ముఖ్యులు భేటీ అయ్యారు. ఏలూరు నగరంలో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో స్థితిగతులపై మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు చర్చించారు. కార్యక్రమంలో ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, ఏలూరు నగర నాయకులు మామిళ్లపల్లి జయప్రకాష్, పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఏలూరులోని జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతుందని జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ కేఎస్ఎస్ సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో నూతనంగా ఎన్నికైన లోక్‌సభ సభ్యులు, శాసనసభ సభ్యులను స్థాయి సంఘాలకు ఎన్నిక కార్యక్రమం, జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తారని పేర్కొన్నారు.

హద్దుమీరిన టీడీపీ శ్రేణుల వికృత చేష్టలు

- కవ్వగుంటలో కొఠారుకు హారతి ఇచ్చారని దుకాణం తొలగింపు
- రోడ్డునపడి కన్నీరుమున్నీరవుతున్న రామలక్ష్మి కుటుంబ సభ్యులు



భర్త, కుమారుడితో రామలక్ష్మి కుటుంబం



బడ్డీని పొక్లెయిన్‌తో తొలగిస్తున్న దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: గ్రామాల్లో పార్టీల పేరుతో కక్షపూరితంగా వ్యవహరించి అన్యాయంగా ఒక కుటుంబ జీవన మనుగడైన దుకాణాన్ని తొలగించి కడుపుమీద కొట్టిన హృదయవిదారక సంఘటన పెదవేగి మండలం కవ్వగుంట గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గరికపాటి రామలక్ష్మి భర్త ప్రసాద్ వికలాంగుడు, వారి కుమారుడు ధనుష్ సాయి మానసిక వికలాంగుడు, వారికి ఒకపాప ఉంది. రామలక్ష్మి కుటుంబం కవ్వగుంట గ్రామంలో రావిచెట్టు సెంటర్‌లో రామాలయం ఎదురుగా గత 20 ఏళ్లుగా చిన్నపాటి దుకాణం నిర్వహించుకుంటూ దీనిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కుమారుడికి మెదడు సంబంధిత సమస్య ఉండటంతో నెలకు రూ.5 వేల వరకు హైదరాబాద్‌లో వైద్యం చేయిస్తున్నారు. భర్త వికలాంగుడు కావడంతో ఏ ఉపాధికి వెళ్లలేక దుకాణంలో కూర్చుని ఉంటాడు. అన్నీ తానై బాధిత మహిళ రామలక్ష్మి కుటుంబాన్ని పోషిస్తోంది. 18 ఏళ్లు వచ్చినా కుమారుడికి చిన్నప్పటి నుంచి ఏ ప్రభుత్వం నుంచి లబ్ధి పొందక వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక కుమారుడికి పెన్షన్ రావడంతో వైఎస్సార్‌సీపీ అంటే రామలక్ష్మి అభిమానం. ఈ నేపథ్యంలో 2024 ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామానికి చెందిన అప్పటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి రామలక్ష్మికి హారతి ఇవ్వడంతో అప్పటి నుంచి పగపట్టిన టీడీపీ కార్యకర్తలు కొట్టు నరేష్, కొట్టు సత్యం, ఆటో నాగు, తెట్టిపల్లి రాంపండు, అనుమల దాసు, సుగసాని గంగయ్య, విప్పల ప్రాద్బలంతో టీడీపీ నాయకుల అండదండలతో తహసీల్దార్, కార్యదర్శులు పొక్లెయిన్‌తో దుకాణాన్ని గురువారం తొలగించారు. ఇంటి పక్కన ఉన్న మట్టిని తొలగించి, చెట్టును నరికివేసి, వాటర్ ట్యాప్‌ను సైతం తొలగించారని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. కుటుంబంలో భర్త, కొడుకు పరిస్థితి బాగోకపోయినా మహిళ అని కూడా చూడకుండా తన కుటుంబాన్ని రోడ్డుపాలు చేశారంటూ రామలక్ష్మి రోదిస్తోంది.

క్లుప్తంగా

లారీ ఢీకొని వ్యక్తి మృతి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై జబీర్

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలంలోని గురవాయిగూడెంలో లారీ ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. టి.నర్సాపురం మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన దగ్గుమళ్ల రామారావు (55) ద్విచక్రవాహనంపై గురువారం మండలం చక్రదేవరపల్లి గ్రామంలో జరిగిన ఒక ఫంక్షన్‌కి హాజరయ్యాడు. అక్కడ భోజనం చేసి తిరుగు పయనం కాగా గురవాయిగూడెం వచ్చేసరికి జంగారెడ్డిగూడెం వస్తున్న లారీ వెనుకనుంచి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో రామారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని జంగారెడ్డిగూడెం ఎస్సై జబీర్ పరిశీలించారు. లారీ డ్రైవర్‌ని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. రామారావు తాపీ మేస్త్రి. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చైల్డ్ కేర్ హోమ్‌లలో తనిఖీలు

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని రిజిస్టర్డ్ చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్, రిజిస్ట్రేషన్ లేకుండా హోమ్‌లు నిర్వహిస్తున్న 8 చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్‌లో గురువారం జిల్లా స్థాయి ఇన్‌స్పెక్షన్ కమిటీ తనిఖీలు నిర్వహించిందని డీసీపీఓ సీహెచ్ సూర్యచక్రవేణి చెప్పారు. ఈ హోమ్‌లలో 18 ఏళ్ల లోపు ఆశ్రయం పొందుతున్న బాలలకు అందిస్తున్న వసతి, ఇతర సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి ఒక్క చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్ జువైనల్ జస్టిస్ యాక్ట్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని నిర్వాహకులకు సూచించినట్లు తెలిపారు. అలాగే ఎవరైనా ఆదరణ, సంరక్షణ అవసరం ఉన్నటువంటి బాలలకు వసతి గృహాలు నడుపుతున్నట్లయితే జువైనల్ జస్టిస్ యాక్ట్ సెక్షన్ 41 ప్రకారం రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని తెలియజేశారు. ఈ తనిఖీల్లో డిస్ట్రిక్ట్ ప్రొబేషనరీ ఆఫీసర్, నోడల్ ఆఫీసర్, చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్ కన్వీనర్ జె.దుర్గాప్రసాద్, కో-కన్వీనర్ డీసీపీఓ డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణి, సభ్యులు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎ.పద్మావతి, ఇనిస్టిట్యూషన్ కేర్ ఆఫీసర్ సీహెచ్ శ్రీకాంత్, లీగల్ ప్రొబేషన్ ఆఫీసర్ సి.జాహ్నవి పాల్గొన్నారు.

చోరీ ఘటన విషాదాంతం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో నెలరోజుల క్రితం సంచలనం సృష్టించిన చోరీ ఘటన గురువారం విషాదం మిగిల్చింది. వివరాల ప్రకారం.. జూలై 29వ తేదీ మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో వృద్ధురాలు కలిశెట్టి అనసూయ (74) ఇంటిలోకి ఇద్దరు వ్యక్తులు చొరబడ్డారు. వృద్ధురాలిపై రాయితో దాడి చేయడంతో పాటు నగలు దొంగిలించడమే కాకుండా అతి కిరాతకంగా ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాధితురాలు అనసూయను పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించారు. అక్కడ ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గత నెల రోజులుగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు ఆమె బంధువులు తెలిపారు. రాడమండ్రిలో ఆమె అంత్యక్రియలు చేసినట్లు చెప్పారు. సీఐ కె.రజనీకుమార్ కేసును విచారణ చేస్తున్నట్లు తెలిపారు.



కఠిన చట్టాలు రూపొందించాలి



కోల్‌కతా ట్రైనీ వైద్యురాలు ఉదంతం దేశ వ్యాప్తంగా ఆందోళన కల్గించింది. మహిళలపై లైంగిక దాడులు చేసే వారిని శిక్షించేందుకు కఠినమైన చట్టాలు రూపొందించాలి. మహిళలకు రాత్రి వేళ పనివేళలు తగ్గించాలి. పని ప్రదేశంలో పక్కా భద్రత ఏర్పాటు చేయాలి. సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకర కథనాలు సృష్టిస్తున్న వారిని హెచ్చరించాలి. అన్నివేళలా మహిళల పట్ల గౌరవ, మర్యాదలు పాటించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు బోధించాలి.
– కేఎస్‌వీ సత్యవతి, ఉపాధ్యాయురాలు, ఏలూరు

శిక్షలు కఠినంగా ఉండాలి



రోగుల ప్రాణాలను రక్షించే వైద్యులకు భద్రత కరువైంది. కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచారం ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలి. నిందితులకు తప్పుచేద్దామనే ఆలోచన కూడా రాకుండా చట్టాలు రూపొందించాలి. చట్టాల అమలు కూడా పకడ్బందీగా చేయాలి. దేశమంతా మార్పునకు ఆమోదం తెలిపాలి. ప్రజల్లో కూడా అవగాహన పెరగాలి.
– డాక్టర్ ఐ.ప్రవీణకుమార్, మెడికల్ ఆఫీసర్, పోతునూరు పీహెచ్‌సీ

30 రోజుల్లో మందు మానేస్తున్నారు..

- నిషా జీవితాలను చక్కదిద్దుతున్న డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రాలు
- క్రియాశీలక పాత్ర పోషిస్తున్న తాడేపల్లిగూడెం, ఏలూరులోని కేంద్రాలు
- డ్రగ్స్, గంజాయి వినియోగంపై మత్తు బానిసలకు అవగాహన



మద్యం బానిలసకు సైకాలజీ తరగతులు





తాడేపల్లిగూడెంలోని దీక్ష మత్తు పదార్థాల బానిసల పునరావాస కేంద్రం

తాడేపల్లిగూడెం: నేటి సమాజంలో మద్యం ఒక ఫ్యాషన్‌గా మారింది. సంతోషం వచ్చినా.. విషాదం ఆవహించినా మత్తులో జోగడమే పరిపాటి అయ్యింది. ఒక సంస్థ చేసిన సర్వేలో గతంలో మద్యం తాగే తొలి అనుభవం 25 సంవత్సరాల వయస్సులో కలిగితే.. ప్రస్తుతం 13వ ఏట నుంచే మద్యం రుచి చూస్తున్నారని సంస్థ సర్వే సారాంశం. మాధ్యమాల ప్రభావమో.. పాశ్చాత్య సంస్కృతి ప్రభావమో కానీ.. సరదాగా ప్రారంభమైన మద్యం అలవాటు అనంతరం వ్యసనంగా మారి అనర్థాలకు దారి తీస్తోంది. ఎన్నో జీవితాలను నాశనం చేస్తోంది. మద్యం మత్తులో అత్యాచారాలు, హత్యలు, అసాంఘిక కార్యకలాపాలు పెచ్చరిల్లిపోతున్నాయి. సామాజిక జాఢ్యంగా మద్యం మహమ్మారి జడలు విప్పడంతో పూర్తిగా మద్యానికి బానిసైన వారిని ఆ మత్తులో నుంచి బయటకు తీసుకొచ్చేందుకు, వారి జీవితాలను చక్కదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రాలు నిర్వహిస్తున్నాయి.

మత్తు రహిత భారతం కోసం..

కేంద్రంలోని సోషల్ జస్టిస్ ఫర్ ఎంపవర్‌మెంట్ శాఖ ద్వారా నషా ముక్త్ భారత్ (మత్తు రహిత భారత దేశం) కోసం ప్రయత్నాలు గత పదేళ్లగా చేస్తున్నాయి. మత్తులో తూగే జిల్లాలు దేశ వ్యాప్తంగా 372 ఉంటే, ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాలు ఉన్నాయి. నషా ముక్త్ భారత్ కోసం జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్, డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రాల నిర్వాహకులు భాగస్వాములుగా జిల్లాల్లో కమిటీలు పనిచేస్తున్నాయి.

క్రియాశీలకంగా డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రాలు

మద్యానికి బానిసైన వారిని 30 రోజుల వ్యవధిలో మందు మాన్పించడానికి, మార్పు తీసుకురావడం కోసం డ్రగ్ డీ అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరికి కేంద్ర స్థానంలో ఉన్న తాడేపల్లిగూడెంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్ మంత్రిత్వ శాఖ సహకారంతో దీక్ష డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్‌ను దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వహిస్తోంది. జిల్లా రెండుగా విడిపోవడంతో, తాడేపల్లిగూడెం కేంద్ర సేవలను గుర్తించిన కేంద్రం ఏలూరులో కూడా ఈ కేంద్ర నిర్వహణ బాధ్యతలను గూడెం కేంద్రానికే అప్పగించారు. తాడేపల్లిగూడెం, ఏలూరులో కలిపి ఇప్పటి వరకు 2000 మందికి కౌన్సెలింగ్ ఇస్తే సుమారు 1700 మంది మందు మానేశారు.

ఈ కేంద్రాల్లో ఏం చేస్తారంటే..

మద్యానికి బానిసైన వారి నుంచి తాగుడుకు ఎలా బానిసయ్యారో.. ఏ పరిస్థితులు దీనికి సహకరించాయో వివరాలడిగి తెలుసుకుంటారు. దానికనుగుణంగా గ్రూపు థెరపీ, వ్యక్తిగతంగా, వైద్యుల ద్వారా కౌన్సెలింగ్ పద్ధతుల్లో 30 రోజుల పాటు కేంద్రంలో ఉంచి మందు తాగే అలవాటును మాన్పిస్తారు. తాడేపల్లిగూడెం, ఏలూరులలో కలిసి 30 బెడ్ల సామర్థ్యం ఉంది. నెల రోజుల పాటు కౌన్సెలింగ్, వైద్యం, భోజనం, వసతి అంతా కూడా ఉచితంగానే కల్పిస్తారు. డీ అడిక్షన్ కేంద్రాల్లో ఇద్దరు కౌన్సిలర్‌లతో పాటు ఒక వైద్యుడు, నర్సు, సిబ్బంది సేవలు అందిస్తారు. సైకాలజీ తరగతులు, లాఫింగ్ యోగా, యోగా వంటివి కూడా నేర్పుతున్నారు.

మంచి ఫలితాలు వస్తున్నాయి



మా కేంద్రం తాడేపల్లిగూడెంలో ప్రారంభించి పదేళ్లు కావస్తోంది. జిల్లా విభజన తర్వాత ఏలూరులో కూడా ప్రారంభించాం. ఇప్పటి వరకు సుమారు 1700 మంది మద్యం అలవాటును మానేశారు. మొదట కేంద్రంలో చేరినవారు మూడు నాలుగు రోజులు అదో రకంగా ఉంటారు. నెమ్మదిగా అనుభవాలు పంచుకుంటారు. తాగుడుకు బానిస అవ్వడం వల్ల శరీరంలో అవయవాలపై ఎలా ప్రభావం చూపుతుంది.. సమాజంలో ఎలా పలుచన అవుతారో వారికి వివరిస్తాం. తాగుడు మానితే భవిష్యత్ ఎలా బాగుపడుతుందో కౌన్సెలింగ్, గ్రూపు థెరపీల ద్వారా అర్థమయ్యేలా చెబుతాం. దీంతో వారిలో చాలా వరకు మార్పు వస్తుంది. ఈ కేంద్రంలో చేరాలనుకొనేవారు 08818–223969 నంబరులో సంప్రదించవచ్చు.
– మల్లిపూడి కనకదుర్గాదేవి, కేంద్ర నిర్వాహకురాలు, తాడేపల్లిగూడెం

రెండు ఇసుక టిప్పర్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న టిప్పర్ లారీలు

చింతలపూడి: చింతలపూడి మండలం అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద రెండు ఇసుక టిప్పర్లను గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రానికి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఈ టిప్పర్లను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఇసుక కుక్కునూరు రీచ్ నుంచి యర్రగుంటపల్లి తరలిస్తున్నట్లు పత్రాలు ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసి ఇసుక టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

అరుదైన గోధుమ తాచు పట్టివేత



8 అడుగుల గోధుమ తాచుతో క్రాంతి

జంగారెడ్డిగూడెం: అరుదైన విషపూరితమైన 8 అడుగుల గోధుమ తాచు పామును స్నేక్ సేవియర్స్ సొసైటీ అధ్యక్షుడు చదలవాడ క్రాంతి గురువారం పట్టుకున్నారు. జంగారెడ్డిగూడెం బైపాస్ రోడ్డు అవతల ఆర్.నాగరాజు ఇంట్లోని పొగాకు బేళ్ల మధ్యలో పాము ఉంది. బేళ్లు తీస్తున్న క్రమంలో ఒక్కసారిగా బుసలు కొడుతూ బయటకు రావడంతో క్రాంతికి సమాచారం అందించారు. క్రాంతి పామును సురక్షితంగా పట్టుకుని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా క్రాంతి మాట్లాడుతూ ఇది అరుదైన, విషపూరితమైన పాము అన్నారు. ఇది కరిస్తే దీని విష ప్రభావం నరాలపై ప్రభావం చూపి ప్రాణాపాయం సంభవిస్తుందని, పాము కరిచిన 40 నిమిషాల్లోపు సమీపంలో ఉన్న హాస్పిటల్‌కి వెళ్లి వైద్యం చేయించుకోవాలని సూచించారు.

కారు ఢీకొని వృద్ధుడు మృతి

గణపవరం: గణపవరంలో కారు ఢీకొని ఓ వృద్ధుడు మరణించాడు. వివరాల ప్రకారం బుధవారం రాత్రి వీరాస్వామి రోడ్డుపై వెళ్తుండగా ఏపీ 30 జె 9000 నెంబరు గల కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరాస్వామి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. వీరాస్వామి కుమారుడు సుందర్రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట



ఐఎస్ జగన్నాథపురం ఎర్రకాలువలోకి వెళ్లే మార్గాన్ని జేసీబీతో ధ్వంసం చేయిస్తున్న ఎస్సై సుధీర్

ద్వారకాతిరుమల: నిబంధనలను మీరి ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని ఎస్సై టి.సుధీర్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, భీమడోలు సీఐ బీబీ రవికుమార్ ఆదేశాల మేరకు ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు గురువారం ఎస్సై టి.సుధీర్ ఐఎస్ జగన్నాథపురం, ఐఎస్ రాఘవాపురం గ్రామాల్లోని ఎర్రకాలువలోకి వెళ్లే మార్గాలను జేసీబీ సహాయంతో ధ్వంసం చేయించారు. ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళ్లే వీలు లేకుండా గుంతలు తవ్వించారు.

నిట్‌లో క్రీడా దినోత్సవం



నిట్‌లో క్రీడాదినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ వీరేష్‌కుమార్ అన్నారు. గురువారం నిట్‌లో జరిగిన జాతీయ క్రీడా దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహిస్తున్నాయని, విద్యార్థులు ఈ అవకాశాలను అందిపుచ్చుకొని క్రీడాకారులుగా ఎదగాలన్నారు. అసోసియేట్ డీన్ కిరణ్ తీపర్తి మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడల్లో దేశం తరఫున పాల్గొని వరుసగా మూడుసార్లు బంగారు పతకాలను దేశానికి అందించిన హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును జాతీయ క్రీడాదినోత్సవంగా జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. దేశభక్తిని, క్రీడా స్ఫూర్తిని చాటిచెప్పి ధ్యాన్‌చంద్ భావితరాలకు స్ఫూర్తిప్రదాతగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా సిబ్బంది, విద్యార్థులు నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆచార్యులు వి.సందీప్, డాక్టర్ రాముడు, సాస్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

వృద్ధురాలి మృతి, మరొకరి పరిస్థితి విషమం



కైకలూరు మండలం సింగాపురం వద్ద ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



మృతి చెందిన దుర్గాదేవి



చికిత్స పొందుతున్న విశ్వనాథరాజు



క్షతగాత్రుడు అప్పలరాజు

కైకలూరు: వేగంగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఓ ఆటోను ఢీకొట్టడంతో ఆటోలోని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన కై కలూరు మండలం సింగాపురం జాతీయ రహదారిపై గురువారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం చెరుకువాడ గ్రామానికి చెందిన దాట్ల అప్పలరాజు (64), వీరి అన్నయ్య విశ్వనాథరాజు (70), వదిన దుర్గాదేవీ (68) కలసి ఆటోలో కైకలూరులో టైల్స్ కొనుగోలు చేయడానికి వచ్చారు. తిరిగి ప్రయాణంలో సింగాపురం వద్దకు రాగానే భీమవరం – ఏలూరు పాసింజరు ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీ కొట్టింది. కొంతదూరం ఈడ్చుకు వెళ్లడంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కై కలూరు ఆస్పత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దుర్గాదేవి మరణించింది. ఆమె భర్త విశ్వనాథరాజు పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు చెప్పారు. ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడు అప్పలరాజు ఫిర్యాదు మేరకు రూరల్ ఏఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానంతో భార్యపై కత్తితో దాడి



ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిర్మల

పెదవేగి: గత కొంతకాలంగా కుటుంబ కలహాలు, దీనికి తోడు భార్యపై అనుమానంతో ఓ వ్యక్తి భార్యపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. పెదవేగి ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం ముండూరు గ్రామానికి చెందిన అనపా అచ్చియ్య, నిర్మల భార్యభర్తలు. వీరికి ఇద్దరు సంతానం. అచ్చియ్య కూలి పనులకు వెళ్తుంటాడు. గత కొంతకాలంగా భార్య, భర్తల మధ్య వివాదం నెలకొండడంతోపాటు నిర్మలపై అచ్చియ్య అనుమానం పెంచుకున్నాడు. ఈ నెల 27న భార్యభర్తలు ఇద్దరు గొడవపడ్డారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో నిర్మలపై అచ్చియ్య కత్తితో దాడి చేయడంతో ఆమె రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమె పెద్దగా కేకలు వేస్తూ ఇంటి నుంచి బయటకు పరిగెట్టడంతో స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. ఏలూరులోని జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి ఆమెను తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

ఏలూరు (టూటౌన్): చెక్‌బౌన్స్ కేసులో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ కమర్షియల్ టాక్స్ కార్యాలయ ఉద్యోగికి ఏడాది జైలు శిక్ష పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో క్లర్కుగా పనిచేస్తున్న కాజా కిరణ్ ఏలూరుకు చెందిన గెడ్డం శ్రీ వంశీ దగ్గర కొద్ది రోజుల కిందట కొంత సొమ్ము అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించే నిమిత్తం చెక్కు ఇచ్చారు. దాన్ని బ్యాంకులో వేస్తే చెల్లకపోవడంతో వంశీ కోర్టును ఆశ్రయించాడు. విచారణ అనంతరం ఏలూరు మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి గురువారం తీర్పు వెలువరించారు. చెల్లని చెక్కు ఇచ్చిన కాజా కిరణ్‌కు ఏడాది జైలు, రూ.2 లక్షల జరిమానా విధించారు.

పనిచేస్తూ.. కుప్పకూలి తాపీమేస్త్రి మృతి

ద్వారకాతిరుమల: కూలిపని చేస్తూ ఒక తాపీ మేస్త్రి గుండెపోటుకు గురై కుప్పకూలి పడిపోయాడు. స్థానికులు హుటాహుటీన పీహెచ్‌సీకి తరలించేలోపే అతడు మృతి చెందాడు. వివరాల ప్రకారం. భీమడోలు మండలం పోలసానిపల్లికి చెందిన తాపీ మేస్త్రి మడికి విశ్వేశ్వర గురువారం ఉదయం ద్వారకాతిరుమలలో కూలి పనులకు వెళ్లాడు. ఒక ఇంటి వద్ద మట్టి పనులు చేస్తుండగా అకస్మాత్తుగా గుండెపోటుకు గురై, కుప్పకూలి పడిపోయాడు. స్థానికులు వెంటనే ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి తరలించగా, పరీక్షించిన వైద్య సిబ్బంది అప్పటికే అతడు మృతి చెందినట్లు నిర్ధారించారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా

ఏలూరు(మెట్రో): ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు, మండల వ్యవసాయ అధికారులకు రెండురోజుల పాటు శిక్షణ నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా చెప్పారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో గురువారం నిర్వహించిన మొదటిరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాతావరణం,, భూమి, గాలి, నీరు వంటివి ప్రకృతి వ్యవసాయానికి ఏ విధంగా అనుసంధానింపబడినవో వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో పాటిస్తున్న వివిధ రకాల మోడల్స్‌పై శిక్షణ అందించి, వివిధ పంటల విధానం, పంటల వైవిధ్యతపై అవగాహన కలిగించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులను శిక్షణా కార్యక్రమంలో చూపిన విధంగా క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కలిగించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం తాతారావు, ఏడీ లలిత సుధా, శైలజ, అడిషనల్ డీపీఎం వల్లి, జిల్లాలోని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటాపురంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన వరి పొలాన్ని, అమ్మపాలెం గ్రామంలో కొబ్బరిలో 5 లేయర్‌ల మోడల్‌పై వ్యవసాయ అధికారులకు అవగాహన కల్పించారు.

ఓటర్ సవరణకు డోర్ టు డోర్ సర్వే



గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, డీఆర్‌వో తదితరులు

ఏలూరు(మెట్రో): ఓటర్ల జాబితాలోని వివరాలు ధ్రువీకరించేందుకు ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ, 2025కు సంబంధించి ఆగస్టు 20వ తేదీ నుంచి అక్టోబరు 18వ తేదీ వరకు సంబంధిత బీఎల్‌ఓలు డోర్ టు డోర్ సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. సంబంధిత బీఎల్‌ఓలు ఇంటి వద్దకు వచ్చినప్పుడు కుటుంబ సభ్యుల వివరాలు, ఇంటి నంబరు, పోలింగ్ కేంద్రం వివరాలు, మరణించిన వారి వివరాలు, శాశ్వతంగా షిఫ్ట్ అయినవారి వివరాలు తెలియజేయాలని కోరారు.

తెలుగు భాషావేత్త గిడుగు రామ్మూర్తికి నివాళి
తెలుగు భాషా వైభవానికి పునాదులు వేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి అని కలెక్టర్ కె. వెట్రిసెల్వి పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవం పురస్కరించుకొని గురువారం ఏలూరు కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో వాడుక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి కలెక్టర్ వెట్రిసెల్వి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి తెలుగు భాషా ఔన్నత్యాన్ని చాటి చెప్పిన గొప్పవ్యక్తి అని కొనియాడారు.

నేడు జిల్లా వ్యాప్తంగా వన మహోత్సవం
ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న జిల్లా స్థాయి వనమహోత్సవ కార్యక్రమం ఏర్పాట్లపై స్థానిక కలెక్టరేట్ నుంచి గురువారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించి అధికారులకు దిశా, నిర్దేశం చేశారు. లక్ష మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు.

ఏలూరులో 3కె రన్
ఏలూరు రూరల్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గురువారం ఏలూరులో అధికారులు 3కె రన్ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని గోదావరి హాల్లో నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు అందరూ ఫిట్‌గా ఉండాలి అన్నారు. ఇందుకోసం క్రీడలు, వ్యాయామం సాధన చేయాలన్నారు. అనంతరం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మూడురోజుల పాటు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో డీఆర్వో డి.పుష్పమణి, డ్వామా పీడీ ఎ.రాము, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, డీఎస్‌డీఓ బి శ్రీనివాస్, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి, డీఈఓ ఎస్ అబ్రహం, ఉద్యానశాఖ డీడీ రామ్మోహన్, ఇరిగేషన్ ఎస్ఈ దేవప్రకాష్, డీపీవో తూతిక శ్రీనివాస పాల్గొన్నారు.